సాక్షి తిరుపతి

ఆదివారం । 14 । మే । 2023



స్వచ్ఛ తిరుమలే లక్ష్యం

'స్వచ్ఛ తిరుమల..సుందర తిరుపల'లో భాగంగా టీటీడీ చేపట్టిన సామూహిక శ్రమదానానికి విశేష స్పందన లభించింది. - 8లో



ప్రజలు సుభిక్షంగా ఉండాలి

తిరుపతి శ్రీతాతయ్యగంట గంగమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని డెప్యూటీ సీఎం నారాయణస్వామి ఆకాంక్షించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	42	28
చిత్తూరు	41	27
తిరుమల	37	24
గూడూరు	44	31
నగరి	43	29

న్యూస్‌రీల్

నేటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు



ముస్తాబైన ఆకాశగంగ

తిరుమల : తిరుమలలో హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం నుంచి 18వ తేదీ వరకు టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ మేరకు అంజనాద్రి ఆకాశ గంగ, జాపాలి, నాదనీరాజన వేదిక, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం, బేడీ ఆంజనేయ స్వామివారి ఆలయం ఏర్పాట్లు పూర్తిచేసింది. అంజనాద్రి ఆకాశ గంగ వద్ద ఆదివారం ఉదయం 8.30 గంటలకు, శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న శ్రీ బేడి ఆంజనేయ స్వామివారికి ఉదయం 9 గంటలకు, కాలినడక కబాటలో ఏడవ మైలు వద్ద ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి వారికి మధ్యాహ్నం 3 గంటలకు హనుమజ్జయంతిని పురస్కరించుకుని విశేషంగా అభిషేక, అర్చన, నివేదనలు నిర్వహించనున్నారు

ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి

తిరుమలలో హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తుల రద్దీ నేపథ్యంలో ఆకాశగంగ, పాపవినాశనం వద్ద పార్కింగ్ సమస్య దృష్ట్యా తిరుమల నుంచి, గోగర్భం డ్యామ్ సర్కిల్ వరకు భక్తుల రాకపోకలకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తామని టీటీడీ తెలిపింది. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరింది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 71,763 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 35,399 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.19 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

నేటి నుంచి చంద్రగిరి ఐపీఎల్

- వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌కు సర్వం సిద్ధం
- 1000 జట్లతో టోర్నమెంట్ నిర్వహణ
- 16 గ్రౌండ్లలో తలపడనున్న 15,000 మంది క్రీడాకారులు
- రూ.25 లక్షల నగదు బహుమతులు

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తుమ్మలగుంటలో ఐపీఎల్ క్రికెట్ సందడి నెలకొంది. ప్రభుత్వ విప్, తుడా చైర్మన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నేతృత్వంలో నేటి నుంచి జరగనున్న వైఎస్సార్ చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీకి సర్వం సిద్ధమైంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా ఒకే మైదానంలో 16 జట్లు తలపడే విధంగా ఏర్పాట్లు చేపట్టడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేగాక క్రీడాకారులతోపాటు ప్రేక్షకులకు సైతం మాంసాహార విందు భోజనాలు ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



పిచ్‌ల వద్ద మార్కింగ్ వేస్తున్న సిబ్బంది



చంద్రగిరి ఐపీఎల్‌కు సిద్ధమైన వేదిక

తిరుపతి రూరల్: చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం నుంచి దాదాపు 15 రోజుల పాటు నిరాటంకంగా జరగనున్న ఈ క్రికెట్ టోర్నీకి భారీ ఏర్పాట్లు చేపట్టారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈసారి భారీ ఏర్పాట్ల మధ్య క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నమెంట్ ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు మైదానా లను సిద్ధం చేశారు.

ఏర్పాట్లు అదుర్స్

దేశంలో ఎక్కడాలేని విధంగా ఒకేచోట 1000 క్రికెట్ టీమ్‌ల నుంచి 15,000 మంది క్రీడాకారులు పాల్గొనేందుకు సరిపడేలా 16 గ్రౌండ్లను సిద్ధం చేశారు. అంతేగాక టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు ఎస్ఎస్ కంపెనీకి చెందిన రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్‌ను పంపిణీ చేయనున్నారు. అలాగే ఒక్కో క్రీడాకారునికి బ్రాండెడ్ టీ షర్ట్‌తో పాటు పార్టిసిపేట్ మెడల్, పార్టిసిపేట్ సర్టిఫికెట్‌లను అందజేయనున్నారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలతో పాటు రూ.25 లక్షల మేరకు నగదు బహుమతులు అందజేస్తారు. ఇప్పటికే ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు అన్ని రకాల ఏర్పాట్లును సిద్ధం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అందరికీ మాంసాహార విందు భోజనం

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులతో పాటు ప్రేక్షకులకు సైతం రుచికరమైన మాంసాహార విందు భోజనం ఏర్పాటు చేశారు. ఇప్పటికే క్రీడా మైదానంలో ప్రత్యేక వంటశాలలను ఏర్పాటు చేయించారు. అలాగే క్రీడాకారులకు తాగునీరు, ఎనర్జీ డ్రింక్‌ను కూడా ఏర్పాటు చేసి వేసవి తాపాన్ని తట్టుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. టోర్నమెంట్ నిర్వహణలో భద్రతా పరమైన సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు.

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మినిమం టైమ్ స్కేల్ ప్రాతిపదికన డీఎస్సీ 1988, 2008, అలాగే 2018ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికన కొత్తగా ఎంపికైన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు వృత్యాంతర శిక్షణ ఇవ్వనున్నట్లు డైట్ ప్రిన్సిపల్, తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. దాదాపు 770మంది ఉపాధ్యాయులకు ఈనెల 15 నుంచి జూన్ 9వ తేదీ వరకు ఒక స్పెల్‌కి 200 మంది చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొదటి స్పెల్ ఈ నెల 15నుంచి 19వ తేదీ వరకు తిరుచానూరు జెడ్పీ హైస్కూల్, మిగిలిన మూడు స్పెల్స్‌ను 22నుంచి 26వ తేదీ వరకు, 29నుంచి జూన్ 2 వరకు, జూన్ 5నుంచి 9వ తేదీ వరకు తిరుపతి బాలాజీ కాలనీలోని శ్రీపద్మావతి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే నూతనంగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఉపాధ్యాయులకు ఎర్రావారిపాళెం ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 15నుంచి శిక్షణ ఉంటుందన్నారు.

పన్ను చెల్లింపుపై అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్: ఆదాయపు పన్ను చట్టంలో కొత్తగా అమలయ్యే నిబంధనల్లో పన్ను చెల్లింపుదారులకు ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారంపై శనివారం ఎస్వీయూ సెనేట్ హాలులో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆదాయపు పన్నుశాఖ ప్రధాన ముఖ్య కమిషనర్ రేణుజోహ్రి పాల్గొని అవగాహన కల్పించారు.

ప్రజారోగ్యమే లక్ష్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

పాకాల: 'ప్రజల ఆరోగ్యం కాపాడుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. ముందస్తుగా జబ్బులను గుర్తించడం ద్వారా తగిన మందులు వాడుకునే అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగానే నా నియోజకవర్గంలో మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశాం. ప్రజలందరూ 43 రకాల ఉచిత వైద్యపరీక్షలు చేయించుకోవాలి' అని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన తన సతీమణి లక్ష్మితో కలిసి పాకాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎన్‌వీఎన్ పాఠశాల, గాంధీ నగర్‌లోని ఎంపీపీ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను పరిశీలించారు. వైద్యపరీక్షల నిమిత్తం వచ్చే ప్రజలకు నిత్యం అల్పాహారం, భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులందరూ వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

వైద్య శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి సూచించారు. మెగా వైద్యశిబిరాలను సందర్శించిన ఆయన వైద్యులతో మాట్లాడుతూ రోజుకు ఎంత మందికి వైద్య పరీక్షలు అందిస్తున్నారు.. ఫలితాలను ఏవిధంగా అందజేస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షల ఆవశ్యకతను వివరించాలని ఆదేశించారు. అనంతరం ఎన్‌వీఎన్ వైద్య శిబిరంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.జయదేవ్‌నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

తాబేళ్లతో సముద్రంలో సమతుల్యత



సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను వదులుతున్న వైల్డ్ లైఫ్ అధికారులు, సిబ్బంది

వాకాడు: తాబేళ్ల వల్ల సముద్రంలో సమతుల్యత ఏర్పడుతుందని సూళ్లూరుపేట వైల్డ్ లైఫ్ అధికారులు తెలిపారు. వాకాడు మండలం, నవాబుపేట సముద్ర తీరంలో శనివారం సముద్ర (ఆలీవ్ రీచ్)తాబేళ్ల పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ శ్యాముల్ మాట్లాడుతూ సముద్రంలో కాలుష్యం ఏర్పడకుండా తాబేళ్ల పిల్లలు దోహదపడుతాయన్నారు. అనంతరం సముంద్రం ఒడ్డున పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాలను సేకరించి దూరంగా పడవేశారు. అటవీ అధికారి వరప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దొరవారిసత్రం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, గ్లాస్‌లు తదితర వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్ఓ శ్యాముల్ అన్నారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో శనివారం ప్రపంచ వలస పక్షుల దినోత్సవం సందర్భంగా నేలపట్టు, పులికాట్ ప్రాంతంలోని వన్యప్రాణి విభాగం అధికారులు, సిబ్బందికి పర్యావరణం, ఇటీవల కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లైఫ్ స్టైల్ ఫర్ ఎనవరల్‌మెంట్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్ఓ వరప్రసాద్, ఎఫ్ఎస్ఓ బాలయ్య, ప్రకాష్‌రావు, బీఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకే విమర్శలు



ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి మంగళం: సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మండిపడ్డారు. శనివారం రష్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ప్రజామాధ్యమాల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ పాలనలో ఆటో డ్రైవర్లకు ఒక్క రూపాయి ఇవ్వకుండా ఇప్పుడు ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పడం కేవలం ఓట్ల కోసం తప్ప వారిపై ప్రేమతో కాదన్నారు. తడి ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనాలని ముఖ్యమంత్రి ఆదేశించినప్పటికీ రైతన్నలను రెచ్చగొట్టడం సబబుకాదన్నారు. ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్రజలు నమ్మరని చెప్పారు.

క్లుప్తంగా

530 బస్తాల బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం అన్‌లోడ్ చేయిస్తున్న అధికారులు

తడ: అక్రమంగా తరలుతున్న 530 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తడ పోలీస్ స్టేషన్‌లో సివిల్ సప్లయ్ డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పక్కా సమాచారంతో మాంబట్టు బస్టాండ్ సమీపంలో ఏపీ39 యూఎఫ్ 1235 నంబరు గల లారీలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 26,400 కిలోల తమిళ రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని కొండూరు ఎంఎల్‌సీ పాయింట్‌లో భద్రపరిచారు. అనంతరం లారీని, డ్రైవర్‌ను తడ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ

– ఒక ఎద్దు మృతి

నాయుడుపేటటౌన్: మండలంలోని విన్నమాల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఎడ్ల బండిని లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు మృతిచెందగా, బండిని నడుపుతున్న అగ్రహారపేటకు చెందిన రైతు ఎద్దల శేషారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు తల్లీ



గంగమ్మకు సారె తీసుకువస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, పక్కన భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



అమ్మవారి సేవలో శ్రీసిద్ధేశ్వరానంద భారతి స్వామి, శ్రీశక్తిపీఠాధీశ్వరి శ్రీరమ్యానంద భారతి స్వామి



టీటీడీ తరఫున గోవిందరాజస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి సారె తీసుకెళుతున్న అధికారులు, నేతలు

- గంగమ్మకు సారె సమర్పించిన డెప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని డెప్యూటీ సీఎం నారాయణస్వామి ఆకాంక్షించారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్.జగనన్నకు గంగమ్మ తల్లి కృపాకటాక్షాలు నిండుగా ఉండాలని కోరారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా నాలుగో రోజు శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉప ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ గంగమ్మ ఆలయాన్ని అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేయడమేగాక అమ్మవారి ఆలయానికి జాతీయ హోదా తీసుకొచ్చి చరిత్ర సృష్టించిన ఎమ్మెల్యే భూమనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



ఆకట్టుకున్న కళాకారుల నృత్యం



అమ్మ 'దొర'తనం!

భక్తులపై చల్లని కరుణ కురిపించే తల్లి గంగమ్మ

శక్తి స్వరూపిణి శ్రీతాతయ్యగుంట గంగమ్మతల్లి భక్తులపై చల్లని కరుణ చూపించే తల్లి అని కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతిస్వామి తెలిపారు. స్వామితోపాటు శ్రీశక్తిపీఠాధీశ్వరి శ్రీరమ్యానంద భారతిస్వామి శనివారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్, ఈవో పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహ భాషణం చేస్తూ అమ్మవారి ఆలయంతో తనకు 60 ఏళ్ల అనుబంధం ఉందని పేర్కొన్నారు. అనంతరం శ్రీరమ్యానంద భారతీ స్వామి మాట్లాడుతూ మహిమాన్విత కలిగిన గంగమ్మతల్లి తిరుపతిలో ఉద్భవించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు.

ఉత్సాహంగా ఒంగోలు ఎడ్ల పోటీలు



ఉత్సాహభరితంగా సాగుతున్న ఎడ్ల పోటీలు

గూడూరు: స్థానిక ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో, జాతీయ రహదారి పక్కనే వెలసిన శ్రీఅభయాంజనేస్వామి దేవాలయ పదో వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలు ఎడ్ల బల ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొనగా, విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నట్లు దేవాలయ ధర్మకర్త రవీంద్రరెడ్డి తెలిపారు.

ఘనంగా హనుమజ్జయంతి



శ్రీరామ రక్షా కుటీరంలో హనుమజ్జయంతి

పట్టణంలోని శ్రీరామాంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కోనేటిమిట్ట ప్రాంతంలో వెలసిన శ్రీకోదండ రామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేకాలు, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు 108 సార్లు హనుమాన్‌చాలీసా పఠించారు. అలాగే రెండో పట్టణంలోని శ్రీరామ రక్ష కుటీరంలో కలశ స్థాపన, గోపూజ నిర్వహించారు.

స్వచ్ఛ తిరుమలే లక్ష్యం

- తిరుమల ఘాట్ రోడ్లు, నడకదారుల్లో సామూహిక శ్రమదానం
- పాల్గొన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, టీటీడీ ఈవో, కలెక్టర్, ఎస్పీ



తిరుమల ఘాట్ రోడ్డులో చెత్త ఎత్తుతున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ



తిరుమల ఘాట్ రోడ్డులో టీటీడీ ఈవో ధర్మారెడ్డి



చెత్త వేరుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుమల: 'స్వచ్ఛ తిరుమల..సుందర తిరుపల' విజయవంతమైంది. తిరుమల నడకదారులు, ఘాట్ రోడ్లలో టీటీడీ చేపట్టిన సామూహిక శ్రమదానానికి విశేష స్పందన లభించింది. శనివారం ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద ప్రముఖులు, అధికారులు, ఉద్యోగులు సమావేశమయ్యారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 700 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు సెక్టార్ల వారీగా తమకు కేటాయించిన ప్రదేశాల్లో శ్రమదానంలో పాల్గొన్నారు.

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు ఆంజనేయస్వామివారి ఆలయం నుంచి కొంతదూరం శ్రమదానం చేశారు.
- తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి అలిపిరి టోల్ గేట్ వద్ద శ్రమదానంలో పాల్గొన్నారు. టీటీడీ చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. వంద మంది రెవెన్యూ సిబ్బందితో అలిపిరి టోల్ గేట్ నుంచి రోడ్డుకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర వ్యర్థాలను తొలగించినట్టు తెలిపారు.
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సలహాదారు డా.జయప్రకాష్ సాయి అలిపిరి మార్గంలో 15వ కి.మీ నుంచి 12వ కి.మీ వరకు శ్రమదానంలో పాల్గొన్నారు. జేఈవో సదాభార్గవి మొదటి ఘాట్ రోడ్డులో, జేఈవో వీరబ్రహ్మం రెండో ఘాట్ రోడ్డులో, మున్సిపల్ కమిషనర్ హరిత, సిబ్బంది మోకాలిమెట్టు వద్ద, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, సీవీఎస్‌వో నరసింహకిషోర్, సిబ్బంది అలిపిరి నడకమార్గం వద్ద, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్ శ్రీవారిమెట్టు మార్గంలో శ్రమదానంలో పాల్గొన్నారు. టీటీడీ న్యాయాధికారి వీర్రాజు, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, సీఏవో శేషశైలేంద్ర ఇతర విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.